తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

ఆదివారం 17 మే 2026

పేజీలు : 8

Follow :


## కరీంనగర్‌లో కొనసాగుతున్న తొలి దశ జనగణన ప్రక్రియ

### తనిఖీ చేసి పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్ బ్యూరో, మే 16 (జనంసాక్షి) :** జన గణన ప్రక్రియలో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలో కొనసాగుతున్న తొలి దశ జన గణన ప్రక్రియలో భాగంగా శనివారం రోజు పలు డివిజన్ల పరిదిలో పర్యటించారు. నగరంలోని రాంనగర్, శ్రీహరినగర్ తదితర ప్రాంతాల్లో పలు హౌజ్ లిస్ట్ బ్లాక్ లను స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. సంబంధిత బ్లాక్ ల బౌండరీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జన గణన తొలి దశలో చేపడుతున్న హౌజ్ లిస్ట్ బ్లాక్ నెంబరింగ్, మ్యాపింగ్ ప్రక్రియ పై ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేస్తూ, ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... జన గణన లో చేపట్టిన హౌజ్ లిస్ట్ బ్లాక్స్ మ్యాపింగ్, సిఎన్ హౌజ్ నెంబరింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జనాభా లెక్కింపులో పొరపాట్లు జరగకుండా చర్యలు తీస్కోని ప్రతి నివాస గృహాన్ని సర్వే చేసి ఖచ్చితమైన వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించాలని ఆదేశించారు. జన గణన ప్రక్రియ విధుల్లో అలసత్వం ప్రదర్శించ కుండా ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 2026 జనాభా లెక్కింపులో ప్రజలు భాగస్వాములు కావాలని వివరాల నమోదు కొసం వచ్చిన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు సహాకరించి సరైన వివరాలను అందించాలని కోరారు. నగర అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు జన గణన సర్వే చాలా ప్రధానం అన్నారు. ఎన్యూమరేటర్లు సూపర్ వైజర్లు హౌజ్ లిస్ట్ బ్లాక్స్ వారిగా ప్రతి ఇంటిని సందర్శించి నెంబరింగ్ చేయడంతో పాటు మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. హౌజ్ లిస్ట్ బ్లాక్స్ ప్రకారం ప్రతి ఇంటి వివరాలను సేకరించి... నమోదు చేయాలన్నారు.



సేకరించే వివరాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే స్వీయ గణన చేసుకున్న వారు గణన లెక్కింపు కోసం మీ నివాస గృహాలకు వచ్చిన ఎన్యూమరేటర్లకు ఐడీని చూపించి వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రజలు జన గణన ప్రక్రియ వేగవంతం ముగిసేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జన గణన ప్రక్రియ నగర అభివృద్ధి ఎంతో ముఖ్యమని ప్రజలు ఈ ప్రక్రియకు సహాకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## 48 ఎకరాల ప్రభుత్వ భూమి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి

❍ కలెక్టర్ కోయ శ్రీ హర్ష

❍ ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, చట్టవిరుద్ధ పట్టాలపై కఠిన చర్యలు

**పెద్దపల్లి,మే 16(జనంసాక్షి) :** ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని సర్వే నెం. 273లో ప్రభుత్వ భూములపై జరిగిన అక్రమ ఆక్రమణలు, చట్టవిరుద్ధ రికార్డు నమోదులపై విచారణ చేపట్టి ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెం. 273లో మొత్తం 130.00 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో దాదాపు 59.00 ఎకరాలు కాస్తులో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అందులో సుమారు 48.00 ఎకరాల భూమిని 23 మంది రైతులు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకుని మొఖాపై సాగు చేస్తున్నట్లు విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ల్యాండ్ ఎన్క్రోచ్మెంట్ యాక్ట్, 1905 ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించిన అనంతరం, రికార్డులను సమగ్రంగా పరిశీలించి వారు పొందిన పట్టాదారు హక్కులు చెల్లవని నిర్ధారించినట్లు తెలిపారు. తదనంతరం తహశీల్దార్, ధర్మారం ఆధ్వర్యంలో సుమారు 48.00 ఎకరాల ప్రభుత్వ



భూమిని గట్లు చదును చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ఉన్నా, చట్టవిరుద్ధంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకుని ఉన్నా, స్వచ్ఛందంగా సంబంధిత తహశీల్దార్ల ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో గుర్తించిన వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు.

### మంత్రి శ్రీధర్ బాబు కు బోయిన్ పేట్ సమస్యలపై వినతి పత్రం అందించిన కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి

**మంథని, ( జనంసాక్షి ) :** హైదరాబాద్ లోని మినిస్టర్ కార్యాలయంలో ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ని శనివారం మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్ పేట్ 6వ వార్డ్ ఇండిపెండెంట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి మర్యాదపూర్వకంగా కలసి బోయిన్ పేట్ వివిద సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి, సమస్యలు పరిష్కారిస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇవ్వడం జరిగిందని వారికి, కౌన్సిలర్ శ్రీలత క్రాంతి సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



## రైతులు అధైర్య పడవద్దు ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

❍ వడ్ల కటింగ్ లేకుండా కొనుగోలు చేసే నియోజకవర్గం పెద్దపల్లి

❍ మక్కల కొనుగోలు వేగవంతం చేయండి

❍ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ సందర్శన

❍ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

**పెద్దపల్లి,మే 16(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వరి ధాన్యం మరియు మక్కలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్బంగా మాట్లాడుతూ వేసవికాలం ఎండ అధికంగా ఉందని దీంతో పాటు హమాలి కొరత కూడా కొంత ఉందని అన్నారు. ఐకెపి, సింగల్ విండోస్ సొసైటీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు జరుగు తున్నాయని ఈ వేసవిలో నాలుగున్నర మెట్రిక్ టన్నుల వరి పండినట్లు సివిల్ సప్లై అధికారులు లెక్కలు చెబుతున్నారని అధిక ఎండా కారణంగా మిల్లులో దిగుమతికి కొంత సమయం పడుతుందని అన్నారు. మే 25వ తేదీ వరకు మూడున్నర లక్షల టన్నుల వరి ధాన్యం కొనాలని ప్రభుత్వం , జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు కూడా దృష్టి పెట్టి పనిచేయడం జరుగుతుంది అన్నారు. ఈ నియోజకవర్గంలో మొక్క జొన్నలు కూడా 11 సెంటర్లో రైతులను తీసుకోవడం జరుగుతుందని, మొక్కజొన్న రైతులు కూడా అధైర్య పడవద్దని ఒక గింజ లేకుండా జొన్నలు కొనడం జరుగుతుంది అన్నారు. ప్రస్తుతం వరి ధాన్యం కటింగ్ లేకపోవడం వలన ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదు అన్నారు. ప్రస్తుతం 60 శాతం వరకు వరి ధాన్యం అమ్మడం జరిగిందని



మరో 40 శాతం 15 రోజులలో పూర్తి చేయడం జరుగుతుంది అన్నారు. అనుకోకుండా వర్షం వస్తే రైతులు మొక్కలు తడవకుండా జాగ్రత్త పడాలని, మొక్కల కొనుగోలు కూడా త్వరలో పూర్తి చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

### మక్కల లోడింగ్, రవాణాలో జాప్యం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలి

❍ ధాన్యం, మక్కల కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించాలి

❍ రవాణాకు ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను వినియోగించుకోవాలి

❍ జూలపల్లి మండలంలోని వడ్కాపూర్, మండల కేంద్రంలోని మక్కల కేంద్రాలు,ధర్మారం మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి,మే 16(జనంసాక్షి) :** జిల్లాలో ధాన్యం, మక్కల కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా



తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జూలపల్లి మండలంలోని వడ్కాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జూలపల్లి మండల కేంద్రంలోని మక్కల (మొక్కజొన్న) కొనుగోలు కేంద్రాలను, అలాగే లిధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న వరి ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు పరిస్థితులను, నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద మక్కల లోడింగ్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని సూచించారు. రవాణా పరంగా వాహనాల కొరత సమస్య తలెత్తకుండా చూడాలని, లారీల లభ్యత తక్కువగా ఉన్నచో ప్రత్యామ్నాయంగా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను ఉపయోగించుకొని మక్కల రవాణా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ధర్మారం మార్కెట్ యార్డును పరిశీలించిన కలెక్టర్.. కేంద్రాలకు వచ్చే ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు, రవాణా ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మ పోచాలు, జూలపల్లి తహశీల్దార్ దత్తు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు, జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



## లారీల కొరతతో నిలిచినా ధాన్యం కొనుగోళ్లు

### ఆందోళనలో అన్నదాతలు



**ఇల్లంతకుంట మే 16(జనంసాక్షి )** ఇల్లంతకుంట మండలం అనంతారం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో లారీలు రాక కాంట అయినా కూడ ధాన్యం బస్తాలు వారం రోజులుగా మార్కెట్లో మగ్గుతున్నాయని రైతలు ఆందోళన చెందుతున్నారు.కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి స్థాయి లో కొనుగోలు చేయాలని లారీలను పంపాలని రైతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంక పది రోజులు ఐతే రోహిణి కార్తీ మొదలవుతుందని వర్షాలు పడే ఛాన్స్ ఉన్నదని కొనుగోలు అవుతాయా కావా అనే సందేహంలో ఉన్నారు. శనివారం ఉదయం రైతలు రోడ్డుపై బైటయించి రాస్తారోకో చేశారు. దినితో స్తంభించిన రవాణా వ్యవస్థ, విషయం తెలుసుకున్న ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ కుమార్ ఎమ్మార్వో రాచకట్ల సురేష్ తో మాట్లాడి సమాచారాన్ని అందించడం జరిగింది. అనంతారం రైతులతో మాట్లాడి లారీలను పంపిస్తామని హామీ ఇవ్వడం తో రైతలు ఎమ్మార్వో,ఎస్సై హామీ మేరకు రాస్తారోకో విరమించారు.అనంతరం ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రజలపై భారమే : సీపీఐ

### కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**కరీంనగర్ టౌన్, మే 16, ( జనం సాక్షి)**కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతోందని సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శనివారం కరీంనగర్ కమాన్ చౌరస్తా వద్ద సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపిందన్నారు. గతంలో వాణిజ్య గ్యాస్ ధరలు పెరగడంతో టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లలో ధరలు పెరిగాయని, దీంతో పేదలు బయట తినడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గిన సందర్భాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలు తగ్గించలేదని విమర్శించారు. ధరల పెరుగుదల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటాయని అన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, టేకు మల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కొట్టె అంజలి, బామండ్లపల్లి యుగేందర్, బూడిద సదాశివ, నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం, బాకం ఆంజనేయులు, చెంచల మురళి, నూనావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై బీజేపీ 6వ డివిజన్ ఆధ్వర్యంలో ధర్నా



**కరీంనగర్ రూరల్, మే 16, (జనం సాక్షి)**బొమ్మకల్--గుంటూరు పల్లి పరిధిలోని 6వ డివిజన్‌లో ఐకేపీ కేంద్రాల నిర్వహణలో జరుగుతున్న నిర్లక్ష్యంపై భారతీయ జనతా పార్టీ 6వ డివిజన్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం సేకరణలో ఆలస్యంగా కొనుగోళ్లు జరగడం, రవాణా సౌకర్యాల కొరత, గన్ని సంచుల లోపం, కనీస మద్దతు ధరకు బదులుగా కామన్ ధర చెల్లించడం, బస్తాకు 43 కిలోల వరకు అదనంగా తూకం వేయడం వంటి సమస్యలపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎండాకాలంలో కనీస వసతులు లేకపోవడం, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం రక్షణపై ఆందోళన వ్యక్తమైంది.ఈ సమస్యల నేపథ్యంలో ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం, రాజీవ్ రహదారి (శివాజీ విగ్రహం వద్ద) వద్ద ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, సీనియర్ నాయకులు అసిరి తిరుపతి, గాలిపెల్లి నారాయణ, కాల్వ రామచంద్రం, పుట్టపాక శ్రీధర్, పెద్ది లక్ష్మణ్, పోగుల సాయిచంద్, నేరెళ్ళ శశి, శంకర్, సంఘం అనిల్, రాజుతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై ఘటనపై తక్షణ అరెస్ట్ కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



**కరీంనగర్ టౌన్, మే 16 ( జనం సాక్షి )**మైనర్ బాలికకు సంబంధించిన ఒక కేసులో నిందితుడిగా పేర్కొంటున్న బండి సాయి భగీరథను తక్షణమే అరెస్ట్ చేయాలని, అలాగే కేసు విచారణ వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శులు గుడికందుల సత్యం, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా నాయకులు జిందం ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ, మైనర్ బాలికకు సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని గత కొన్ని రోజులుగా అరెస్ట్ చేయకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. వెంటనే నిందితుడిని అరెస్ట్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అలాగే, కేసు విచారణలో జాప్యం జరుగుతోందని, ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ ఐ టి) పేరుతో కాలయాపన జరుగుతోందని వారు ఆరోపించారు. పేదలకు ఒక న్యాయం, ప్రభావవంతులకు మరో న్యాయం అనే పరిస్థితి రాష్ట్రంలో ఉండకూడదని అన్నారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు.ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పేరును ప్రస్తావిస్తూ, ఆయన రాజకీయ ప్రభావాన్ని ఉపయోగించి కేసు దారి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. అదేసమయంలో, ప్రజా ప్రతినిధులు నైతిక బాధ్యత వహించాలని, అవసరమైతే పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.బిజెపి నినాదాలను ప్రస్తావిస్తూ, న్యాయం అందరికీ సమానంగా ఉండాలని చెప్పే సందర్భాల్లో వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని వక్తలు వ్యాఖ్యానించారు. నిందితుడిగా పేర్కొంటున్న వ్యక్తి ముందుకు వచ్చి న్యాయ ప్రక్రియను ఎదుర్కోవాలని వారు కోరారు.చివరగా, వెంటనే అరెస్ట్ చేయకపోతే వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని సమావేశంలో హెచ్చరించారు. అవసరమైతే నిరసనలు మరింత విస్తరింపజేస్తామని వారు తెలిపారు.ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాయకంటి శ్రీనివాస్, సుంకరి సంపత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, మానస, నగర కమిటీ సభ్యులు పున్నం రవి, ఐద్వా జిల్లా నాయకులు ఉప్పునూటి లక్ష్మి, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టే అంజలి, వామపక్ష నాయకులు శ్రీకాంత్, ఆంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ,ధరలు తగ్గించాలి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి



**ముస్తాబాద్ మే 16 (జనం సాక్షి)**పెంచిన పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి లేదంటే ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చెయ్యాలని బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించిన ఏళ్ళ బాల్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారు.ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసింది.కిషన్ రెడ్డి ,బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచింది.గతంలో యూపిఎ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రి గా ఉన్న నరేంద్ర మోదీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే .మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటన లో పెట్రోల్ ,డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే అనుమానం వచ్చింది నడ్డి విరవపోతున్నారు అనిఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు..యుద్ధం కారణం చూపుతున్నారు..యుద్ధం ఈరోజు రాలేదు..ఏప్పటి నుండో ఉంది.పెట్రోల్ డీజిల్ ధరల పై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నాం.పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేసారు .ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కొండం రాజిరెడ్డి ,మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్,ఆరుట్ల మహేష్, శీల ప్రశాంత్, ఉచ్చిడి బాల్రెడ్డి,తలారి నరసయ్య, గురు బాబు,మామిండ్ల ఆంజనేయులు, తుపాకుల శ్రీనివాస్, సద్ది మధు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు అదనపు బస్సులు వెంటనే నడపాలి

### నిర్లక్ష్యం వహిస్తే బస్ డిపో ముట్టడి తప్పదు:

### బి,ఆర్,ఎస్,వి,నాయకులు కంచర్ల రవి గౌడ్



**సిరిసిల్ల టౌన్ మే 16 (జనం సాక్షి)**హైదరాబాద్‌కు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని బి ఆర్ ఎస్ వి నాయకులు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల బస్టాండు వద్ద ఆర్ఎస్వి ఆధ్వర్యంలో శనివారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బి,ఆర్,ఎస్,వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు సరిపడా బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్నప్పటికీ సరైన బస్సు సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వేములవాడ నుంచి వచ్చే బస్సులు అక్కడికే నిండిపోవడంతో సిరిసిల్ల ప్రయాణికులకు సీట్లు దొరకక గంటల తరబడి నిల్చునే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గంటల పాటు నిల్చుని ప్రయాణించడం ప్రజలకు తీవ్రమైన ఇబ్బందిగా మారిందన్నారు.

సిరిసిల్ల ప్రజలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించిన ఆయన, మాజీ మంత్రి కేటీఆర్ పై కక్ష సాధింపుతోనే సిరిసిల్లకు అదనపు బస్సులు కేటాయించడం లేదనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సిరిసిల్ల డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని డిమాండ్ చేశారు. పది రోజులలో సమస్యను పరిష్కరించి అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోతే విద్యార్థులతో కలిసి భారీ స్థాయిలో డిపో ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మట్టే శ్రీనివాస్, ఆరెల్లి వినయ్ కుమార్, సాదు శేఖర్, బాల్యాల ప్రవీణ్, ఎండి అజ్జు, లింగంపల్లి అబ్బి, పవన్, కోడం వెంకటేశం, అల్వాల లక్ష్మణ్, మాగంటి భాను, ధనుష్ రాజు, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



## రామగుండం మహిళా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా తేజస్విని..

**అంతర్గాం, జనంసాక్షి:**
రామగుండం మహిళ గురుకుల కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులైన తేజస్వినికి అభినందనలు తెలిపారు.గురుకుల కళాశాల అభివృద్ధికి..విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తమవంతు సహకారం అందిస్తామని పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కవ్వంపల్లి సతీష్ పేర్కొన్నారు.అనంతరం తేజస్విని ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రామగుండం మహిళ గురుకుల కళాశాల చైర్మన్ ఉషారాణి-మురళి, ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ మాధవి, కోశాధికారి అంజలి, కార్యదర్శులు రజిత, సంధ్యారాణి పేరెంట్స్ కమిటీ నాయకులు నవీన, శైలజ, కన్నం సంపత్, జ్యోతి, ప్రియాంక, కళ్యాణి, కవిత, శిరీష, స్వాతి, మమత, సునీత, రజిని, విజయ, యమునా, స్వప్న ప్రియ, భవాని, విజయలక్ష్మి, సమత, విజయ, తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన డీజిల్..పెట్రోల్ ధరలు తగ్గించాలి..




**గోదావరిఖని, జనంసాక్షి:**
పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని చౌరస్తాలో సిపిఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో శనివారం ఆటో ట్రాలీని తాళ్ళతో లాగి కేంద్ర ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేశారు సిపిఐ శ్రేణులు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్, సిపిఐ నగర కార్పొరేటర్ మార్కపూరి సూర్య మాట్లాడుతూ ఇటీవల హైదరాబాదులో జరిగిన బీజేపీ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పొదుపు మంత్రం జపించిన కొన్ని రోజులకే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచారని వారు విమర్శించారు.ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజల మీద ఆర్థిక భారం పడుతుందని వారు పేర్కొన్నారు.ఈ మధ్యనే జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు చమురు, గ్యాస్ నిల్వలు దేశంలో అధికంగా ఉన్నాయని, అమెరికా ఇరాన్ యుద్ధం వల్ల మన దేశానికి ఎలాంటి నష్టం లేదని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ధరలు ఎందుకు పెంచిందని వారు ప్రశ్నించారు.వెంటనే ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, తొడుపునూరి రమేష్ కుమార్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.లెనిన్, నాయకులు గొడిశల నరేష్, కరీం, చంద్రశేఖర్, సుధీర్, జగన్, ఆసాల నవీన్, కొమ్ము రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

**కనకం గణేష్‌మహారాజ్..**




**గోదావరిఖని, జనంసాక్షి:**
పెట్రోల్ ధరల పెంపును ఆసరాగా చేసుకుని పాత నిల్వలను కొత్త ధరలకు విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్న పెట్రోల్ బంకుల యాజమాన్యాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా మాజీ కన్వీనర్, బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ జిల్లా నాయకుడు కనకం గణేష్ మహారాజ్ డిమాండ్ చేశారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే 15న దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలను పెంచిన నేపథ్యంలో, పెట్రోల్ బంకులు ఇప్పటికే తక్కువ ధరలకు కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్న పాత స్టాక్‌ను కూడా పెరిగిన కొత్త ధరలకే విక్రయిస్తున్నాయని ఆరోపించారు.ప్రతి పెట్రోల్ బంకులో రోజుకు 10 వేల నుండి 15 వేల లీటర్ల వరకు విక్రయాలు జరుగుతుండగా, లీటరుకు రూ.3 చొప్పున అదనంగా వసూలు చేయడం ద్వారా ఒక్కో బంకు యజమాని రోజుకు రూ.30 వేల నుండి రూ.45 వేల వరకు అక్రమ లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఇది దేశవ్యాప్తంగా కొనసాగుతున్న భారీ దోపిడీ అని విమర్శించారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారులు, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, ఆయిల్ కంపెనీల రీజినల్ సేల్స్ మేనేజర్లు వెంటనే స్పందించి జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు.పాత నిల్వలను కొత్త ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్న బంకులపై ఆవశ్యక వస్తువుల చట్టం-1955, లీగల్ మెట్రాలజీ చట్టం-2009, వినియోగదారుల రక్షణ చట్టం-2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అధికారులు స్పందించకపోతే ప్రజలను ఏకం చేసి సంబంధిత అధికారుల కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కనకం గణేష్ మహారాజ్ హెచ్చరించారు.

# దేశవ్యాప్తంగా 20న మెడికల్ షాపుల బంద్..

**- ఆన్‌లైన్ మందుల విక్రయాలపై నియంత్రణ చేయాలి - కెమిస్టుల ఆందోళన**



**గోదావరిఖని, జనంసాక్షి:**
దేశవ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న మెడికల్ షాపుల బంద్‌కు సంబంధించి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ శనివారం పోస్టర్‌ను విడుదల చేసింది.ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ (ఏఐఓసీడీ) పిలుపు మేరకు బంద్ నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 12.40 లక్షల మెడికల్ షాపులు, ఫార్మసీలు, కెమిస్ట్ దుకాణాలు బంద్‌లో పాల్గొననున్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నియంత్రణ లేకుండా మందుల అమ్మకాలు జరుగుతున్నాయని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఔషధాలు అందిస్తున్నారని ఆరోపించారు.అలాగే కార్పొరేట్ సంస్థలు, ఆన్‌లైన్ యాప్‌లు 30 నుంచి 70 శాతం వరకు భారీ డిస్కౌంట్లు ఇవ్వడం వల్ల చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు.కల్తీ, నాసిరకం మందుల విక్రయాలను అరికట్టాలని, ఆన్‌లైన్‌లో ఒకే డాక్టర్ చీటీని పలుమార్లు ఉపయోగించి మందులు కొనుగోలు చేస్తున్న దుర్వినియోగాన్ని నిలువరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజేందర్, కోశాధికారి పోలు సతీష్ పాల్గొన్నారు. మే 20న జరిగే బంద్‌లో భాగంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, రామగుండం పారిశ్రామిక ప్రాంతాల్లోని సుమారు 650 మెడికల్ షాపులు బంద్ పాటించి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పిట్టల శ్రీనివాస్, ఎన్.కరుణాకర్ రెడ్డి, విష్ణుమూర్తి, కోటగిరి వాసు, సంతోష్, అశోక్, మార్కాచారి, రాజేందర్, సత్యనారాయణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారున్ని అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు

○ రాష్ట్ర పోలీసుల వైఫల్యం
○ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్



**సుల్తానాబాద్,మే 16(జనంసాక్షి) :**
ఫోక్సో కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ను ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటని బిసి సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోమ్ సహాయ మంత్రిగా ఉన్నటువంటి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఫోక్సో కేసులో తప్పించుకుని తిరుగుతున్నా, హోం శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నాడో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోక్సో కేసులో సామాన్యునికి ఒక న్యాయం కేంద్ర సహాయ మంత్రి బండి భగీరథకు మరొక న్యాయమా,అంటూ నిలదీశారు. అదే సామాన్యుడు చేస్తే సామాన్య పౌరుడు చేస్తే ఇప్పటికే అరెస్టు చేసేవారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించి ఫోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని తాళ్లపల్లి మనోజ్ గౌడ్ డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకుందాం..

○ స్టేట్ పబ్లిక్ సెక్టర్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి



**గోదావరిఖని, జనంసాక్షి:**
సీఐటీయు పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోదావరిఖని మెయిన్ చౌరస్తాలోని శ్రామికభవన్ సీఐటీయు కార్యాలయంలో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ అంశం మీద జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అధ్యక్షతన వహించగా.. ముఖ్యఅతిథిగా జనార్దన్‌రెడ్డి,అతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు,విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్‌రావు, బీడీఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిటి సత్తయ్య, వక్తలుగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.రాజారెడ్డి, సిఐటియు పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఎ.ముత్యంరావు హాజరయ్యారు.ఈ సదస్సుకు సింగరేణి, ఎన్.టి.పి.సి, విద్యుత్, ఆర్.ఎఫ్.సి.ఎల్‌లో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ 1991లో ప్రారంభించిన నూతన ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశంలో ప్రయివేటీకరణ ప్రారంభం అయ్యిందని అన్నారు.ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అప్పటి నుండి ఇప్పటి వరకు సీఐటీయుగా అనేక ఆందోళనలు చేశామని అన్నారు. అదే విధంగా ఇతర కార్మిక సంఘాలను కలుపుకుని దేశవ్యాప్తంగా అనేక సమ్మెలు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వాలు మారినా వారి విధానాలు మాత్రం మారడం లేదని అన్నారు.కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రధానమంత్రి నాయకత్వంలో ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ వ్యక్తులకు అమ్మడానికి తెగ ప్రయత్నం చేస్తుందని అన్నారు. అంతే కాదు మరో అడుగు ముందుకు వేసి దేశంలో ఉత్పత్తి, లాభాలు కార్మికుల శ్రమ వల్ల కాదు పెట్టుబడిదారుల వల్ల వస్తున్నాయని చెప్పడం సిగ్గులేని తనానికి నిదర్శనం అన్నారు. అంతే కాదు దేశ సంపద ఆదాని, అంబానీ లాంటి వాళ్లకు కట్టబెడుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగం ఉంటేనే మనుగడ ఉంటుందని, కార్మికులు ఉంటారని అన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 17న రాష్ట్ర స్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నామని దీనికి ముఖ్య అతిథిగా సీఐటీయు జాతీయ ప్రధాన కార్యదర్శి ఎలామారం కరీం వస్తున్నారని దీని జయప్రదానికి పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మికుల్ని కోరారు. నాయకులు ఎం.రామాచారి, ఎన్.బిక్షపతి, డి.కొమురయ్య,లక్ష్మారెడ్డి, శివరాం రెడ్డి, యాకుబ్, మల్లేష్,నరహరిరావు, భూమయ్య రాజమౌళి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీహరి, రాఘవరెడ్డి, ఎద్దు కుమార్, ఓదెలు, సమ్మయ్య,తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గురువుకు అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు..

**గోదావరిఖని, జనంసాక్షి:**
1963లో ఫైవింక్లయిన్ ఏరియాలో ప్రైవేట్ పాఠశాలను స్థాపించి వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన పాపయ్యశాస్త్రి ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా రంగంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రైవేట్ పాఠశాలలు మూతపడటంతో ఆయన కుటుంబం కష్టాల్లోకి వెళ్లింది.పాపయ్యశాస్త్రి వద్ద చదివి వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు తమ గురువును ఆదుకునేందుకు ముందుకొచ్చారు.ఏడాదిన్నర క్రితం నుంచి ప్రతి నెల రూ.5 వేల ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్నారు.అదనంగా వారి పేరుపై రూ.1 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ కూడా చేశారు. ఈ నెల ఆర్థిక సహాయాన్ని స్థానిక డివిజన్ కార్పొరేటర్ పాతపెల్లి రవి చేతులమీదుగా పాపయ్యశాస్త్రి దంపతులకు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన కార్పొరేటర్ పాతపెల్లి రవి, చదువు చెప్పిన గురువును గుర్తుంచుకుని సహాయం చేయడం గొప్ప విషయం.ఈ రోజుల్లో పక్కవారినే పట్టించుకోని పరిస్థితుల్లో గురువుకు అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు అభినందనీయులు అని అన్నారు.అలాగే శిథిలావస్థలో ఉన్న పాపయ్య శాస్త్రి గారి ఇంటిని పరిశీలించిన ఆయన, ప్రభుత్వం ద్వారా పక్కా గృహం మంజూరు చేయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ జల్ల కుమార్, పర్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



# బ్రాహ్మణపల్లి గ్రామంలో శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన

**ఎడపల్లి, మే 16 ( జనంసాక్షి ) :**
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని 30 ఏప్రిల్ 2026 నుండి 23 మే 2026 వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో చెరుకు మరియు వరి పరిశోధనా స్థానం రుద్రూరు శాస్త్రవేత్తలు, మరియు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ, వ్యవసాయంలో లాభదాయకత పెరగడానికి కేవలం అధిక దిగుబడి మాత్రమే కాకుండా, మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న పంటలను ఎంపిక చేసుకోవడం కూడా ఎంతో ముఖ్యం అని తెలియజేశారు. ముఖ్యంగా వరి సాగులో రైతులు స్థానికంగా మరియు రాష్ట్ర / జాతీయ మార్కెట్లలో ఎక్కువగా కొనుగోలు చేసే రకాల్ని ఎంచుకుంటే మెరుగైన ధరలు పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం లేదా వ్యవసాయ శాఖ వారు సిఫార్సు చేసిన రకాలనే ఎంపిక చేయాలి, నాణ్యమైన విత్తనాలు ఉపయోగించాలి. రైతులు డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా తమ పంటకు మంచి ధర పొందవచ్చు. ఇది ఆదాయాన్ని పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. కాబట్టి పంట ఎంపికలో మార్కెట్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని సాగు చేయడం ద్వారా రైతులు లాభదాయకమైన వ్యవసాయం చేయవచ్చు. సేంద్రియ వ్యవసాయం అనేది రసాయన ఎరువులు, కీటకనాశకాలు ఉపయోగించకుండా, సహజ వనరులు మరియు ప్రకృతి ఆధారిత పద్ధతులతో పంటలను సాగు చేసే విధానం. ఈ విధానం ద్వారా నేల ఆరోగ్యం కాపాడబడుతుంది, పర్యావరణం సంరక్షించబడుతుంది, అలాగే మనకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుంది. ప్రధాన సేంద్రియ వ్యవసాయ పద్ధతులు సేంద్రియ ఎరువుల వినియోగం, జీవ ఎరువులు, సహజ కీటక నియంత్రణ, పంట మార్పిడి మరియు మిశ్రమ పంటలు మరియు మల్చింగ్. సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులు పర్యావరణాన్ని కాపాడుతూ, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయవచ్చు. దీర్ఘకాలంలో ఇది సుస్థిరమైన మరియు లాభదాయకమైన వ్యవసాయ విధానం. రైతులు క్రమంగా రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అవలంబించడం ఉత్తమం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ గారు, వ్యవసాయ విస్తరణ అధికారిని జ్యోతి, గ్రామ సర్పంచ్ హన్మంతు గారు మరియు చెరుకు వరి పరిశోధనా స్థానం రుద్రూరు శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య గారు మరియు గ్రామ అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.





## నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ప్రభుత్వ నిర్లక్ష్యమే బీవీఎం
### (బీవీఎం రాష్ట్ర అధ్యక్షులు భూంపల్లి రవితేజ

**కామారెడ్డి ప్రతినిధి (జనం సాక్షి) మే 16**
కామారెడ్డి జిల్లా లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో భారతీయ విద్యార్థి మోర్చా బీవీఎం నాయకులు మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యమే అని ఈ సందర్భంగా అన్నారు. 2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన దాని నుండి గుణపాఠం నేర్చుకోకపోవడం వలన మళ్లీ ఈ ఘటన పునరావృతమైందని అన్నారు. ఏకంగా 100కు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందే లీకు కావడం అనేది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులను కేంద్ర ప్రభుత్వం తీవ్ర మానసిక శోభకు గురిచేసింది. పగలు రాత్రి కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం అనేది ప్రభుత్వానికి మంచిది కాదని ఈ సందర్భంగా హెచ్చరించారు. డబల్ ఇంజన్ సర్కారులు ఇలా పరీక్ష పేపర్లు లీక్ కావడం అనేది చాలా సిగ్గుచేటుగా భావించాల్సిన విషయమని ఈ సందర్భంగా అన్నారు. దీని వెనకాల ఎంత పెద్ద వాళ్ళ హస్తం ఉన్న వాళ్ళందరిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు.
ఈ కార్యక్రమంలో భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా కన్వీనర్ రోహిత్ గారు కో కన్వీనర్ భరత్ బీవీఎం సీనియర్ నాయకులు లింగం,సాయినాథ్,విజయ్ అరుణ్,కార్తీక్,భాను, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో మునిగి చనిపోయిన లచ్చయ్య



**మల్యాల మే 16 (జనం సాక్షి)**
మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గుగ్గిల లచ్చయ్య(63) శనివారం ఉదయం 9 గం గొర్రెలను మేపటానికి గ్రామ శివారు లోని చెరువు వద్దకు తీసుకెళ్లగా 10.30 గం సమయంలో మందలోని ఒక గొర్రె చెరువులోకి వెళ్లిందని ఆ గొర్రెను తీసుకురావడానికి లచ్చయ్య అనునతను కూడా చెరువులో కి వెళ్ళాగా ఆ గొర్రెను కాపాడే క్రమంలో చెరువులోని తీగలు కాళ్లకు చుట్టుకుని బయటకు రాలేక అందులోనే మునిగిపోయాడని అది చూసిన కొక్కెర మల్లవ్వ అను నామే నాకు చెప్పగా భార్య అయిన గుగ్గిళ్ళ గంగ మల్లవ్వ సంఘటన స్థలానికి వెళ్లి చూడగా మరణించి ఉన్నాడని మృతుడి భార్య ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

## కార్మిక నాయకుడికి జర్నలిస్టుల ఘన నివాళి
### బసాని రాజయ్య సేవలు చిరస్మరణీయం: ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్



**మంథని, (జనంసాక్షి) :**
కార్మిక హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కార్మిక నాయకుడు బసాని రాజయ్య తొలి వర్ధంతి కార్యక్రమంలో మంథని ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్ మాట్లాడుతూ.. బసాని రాజయ్య మంథని పట్టణంలో మొట్టమొదటి హమాలి సంఘాన్ని ఏర్పాటు చేసి, హమాలి కార్మికుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన గొప్ప నాయకుడని కొనియాడారు. తన హయాంలో హమాలి కార్మికులకు భవనం నిర్మించి, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. మంథని పట్టణంతో పాటు మండలం, నియోజకవర్గ వ్యాప్తంగా హమాలి సంఘాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించి, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన వ్యక్తిగా బసాని రాజయ్య పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాగే మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేసి, సభ్యులందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి సంఘ అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు అని తెలిపారు. ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం ఆంజనేయులు, కేసారపు రవి, బాసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అభినందనీయం

**మంథని, (జనంసాక్షి) :**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు ఎక్కేటి అనంతరెడ్డి, మంథని విజయ్ కుమార్, వేల్పుల గట్టయ్య లు మాట్లాడుతూ 2001లో కేసీఆర్ ప్రారంభించిన జలదృశ్యం ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ప్రస్తుతం ఉన్న 33 జిల్లాల్లో వేలాది మంది ఉద్యమకారులు వివిధ రూపాల్లో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు, ఉద్యమాలు జరిగాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల చూపిన చొరవ అభినందనీయమని తెలిపారు. అదేవిధంగా మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఉద్యమకారులకు బస్సు పాస్, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన నిజమైన ఉద్యమకారులను మాత్రమే గుర్తించి, తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నాయకులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు తమ పదవులకు రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమానికి మద్దతు తెలిపిన నాయకులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు కమిటీలో భాగమైన కే. కేశవరావు, ప్రొఫెసర్ కోదండరాం వంటి నాయకులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో గోగుల రాజిరెడ్డి, గుర్రం దేవేందర్, జాడి జంపయ్య, జిముడ కొండన్న, కాసిపేట సాంబయ్య, ముస్కుల ప్రభాకర్ రెడ్డి, తాటి బుచ్చన్న, కుంట బద్రి, రొద్ద లింగయ్య, మంథని సాయి కుమార్, కండెల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




## లారీ డ్రైవర్ పై దాడి చేసిన వ్యక్తులను
# కఠినంగా శిక్షించాలి
### తాసిల్దార్ ఆఫీస్ ముందు నిరసన
### లారీ యూనియన్ అధ్యక్షులు. పల్లపు నరసయ్య

**గంభీరావుపేట మే 16(జనంసాక్షి);**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం తాసిల్దార్ కార్యాలయం ముందులారీ డ్రైవర్ పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని లారీ యూనియన్ అధ్యక్షులు నిరసన తెలిపారు , వారు మాట్లాడుతూ గంభీరావుపేట మండలం కేంద్రంలోని, పెద్దమ్మ స్టేజి నుండి పల్లపు రవి అనే డ్రైవర్ లారీ వరి ధాన్యం నింపుకొని గంభీరావుపేటకు వస్తుండగా మండల కేంద్రంలో కొందరు వ్యక్తులు వైరు తాకుతున్నాయని, లారీ డ్రైవర్ లారీ ఆపుకొని కరెంటు వైర్లు,సరి చేస్తుండగా, కొందరు వ్యక్తులు అతనిపై దాడి చేశారని ఆరోపించారు, అతనిపైదాడి చేసిన వ్యక్తుల్ని కఠినంగా శిక్షించాలని కోరారు, లారీ యూనియన్ అధ్యక్షులు మాట్లాడుతూ, రైతుల కొరకు నిరంతరం కష్టం చేస్తూ రవాణా చేసే లారీ డ్రైవర్ పై దాడి చేయడంపై యూనియన్ తరపున దాడి చేసిన వ్యక్తులపై కఠినంగా శిక్షించాలని అధికారులను కోరామని, స్థానిక పోలీస్ స్టేషన్లో, తాసిల్దార్ కార్యాలయంలో, ఫిర్యాదు, చేశామని తెలిపారు,



## రేపు గిరిజన గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
### రీజనల్ కోఆర్డినేటర్ డిఎస్ వెంకన్న



**మంథని, ( జనంసాక్షి) :**
గిరిజన నుంచి ఇంటర్ 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు తెలంగాణ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల బాలికలలో ఎస్టీ బాలికల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రీజినల్ కోఆర్డి నేటర్, డిప్యూటీ సెక్రటరీ డీ.ఎస్. వెంకన్న శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), సిరిసిల్ల, ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), మానాల (వేములవాడ), ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), అక్కన్నపేట (హుస్నాబాద్), ఎస్టీ గురుకుల జునియర్ కళాశాల మంథనిలో సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సె లింగ్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినిలు తెలంగాణ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), సిరిసిల్ల (ఇందిరమ్మ కాలనీ) మే 18న నిర్వహించే కౌన్సెలింగ్ హాజరు కావాలని కోరారు. 10వ తరగతి ఉత్తీర్ణులైనా విద్యార్థినిలు అన్నీ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకొని వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

# ఉనికిని కాపాడుకోవడానికి బిఆర్ఎస్ నాయకుల తప్పుడు ఆరోపణలు

## జిల్లా ప్రధాన కార్యదర్శి తూమ్ జలపతి



**రుద్రంగి మే 16 (జనం సాక్షి)**
ఉనికిని కాపాడుకోవడానికి శుక్రవారం రోజున బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని,రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తూమ్ జలపతి అన్నారు. శనివారం రుద్రంగి మండలంలో ని చింతామణి తండాలో అన్ని గ్రామాల సర్పంచులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎడి లక్ష్మణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ 10 సంవత్సరాల కాలంలో రుద్రంగి మండల కేంద్రానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన పాపాన పోలేదని, నేడు కాంగ్రెస్ రెండున్నర సంవత్సరాలలో ప్రతి గ్రామపంచాయతీలో పది పదిహేను ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని అన్నారు.గత బిఆర్ఎస్ హయంలో మానాల గ్రామంలో తండా రైతులకు తప్పుడు ప్రొసీడింగ్ పత్రాలు ఇచ్చారని వాటిని కప్పిపుచ్చు కోవడానికి బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఇకనైనా తప్పుడు ఆరోపణలు మానుకోవాల న్నారు. అలాగే ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో కలిసి పోడు భూముల పట్టాలకై కలెక్టర్ తో మాట్లాడడం జరిగిందని కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రానున్న రోజుల్లో వారికి పట్టాలు రావడం జరుగుతుందని అన్నారు.వారి నాయకత్వంలో మండలంలో అన్ని గ్రామాలకు నిధులు మంజూరు చేస్తున్నారని వారికి ఉమ్మడి మానాల ప్రజలు రుణపడి ఉంటారన్నారు.కొంతమంది బిఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని రైతులతో, ఉపాధి హామీ కూలీలతో ప్రభుత్వం పట్ల తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు పై బహిరంగ చర్చకు సిద్ధమా అని అన్నారు. ఉమ్మడి మానాల సాగునీటి, తాగునీటి అవసరాల కోసం కలిగుట్ట సూరమ్మ చెరువు ప్రాజెక్టు నుండి నీటిని సరఫరా పార్టీలకు అతీతంగా ప్రయత్నం చేద్దామని ప్రభుత్వానికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాది హామీ కూలీలకు మజ్జిక ప్యాకెట్లు పంపిణీ

**జనంసాక్షి గంగాధర**
మండలంలోని నారాయణపూర్ గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు శనివారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఎండి నజీర్ హుస్సేన్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీలో పనులు చేస్తున్న కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకే మజ్జిగ ప్యాకెట్లు అందించినట్లు తెలిపారు.ఎండకు కూలీల దాహం తీర్చినందుకు తాజా మాజీ సర్పంచ్ ఎండి నజీర్ హుస్సేన్ కు కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ గర్వందుల పర్శరాము గౌడ్,బాబు గంగా లక్ష్మణ్ గౌడ్,సుంకే ప్రేమ్ సాగర్, ఎండి.ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

## వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారికి సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్



**కరీంనగర్, మే 16 (జనంసాక్షి) :**
వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో పన్నెండు లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... గత రెండున్నర సంవత్సరాలుగా అనేక మందిని సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని అందరికీ అందుబాటులో ఉంటూ వివిధ సమస్యలతో వచ్చే వారి కోసం పనిచేస్తూ, అనారోగ్య సమస్యలతో బాధపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం ప్రారంభించిన హెల్ప్ డెస్క్ ఎంతో మంది నిరుపేదలకు సహాయం చేయడానికి ఉపయోగపడుతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నానని ప్రజల దీవెన ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటున్నానని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. చెక్కులు పొందిన వారిలో తంగెళ్లపల్లి లచ్చయ్య, గొడుగు పద్మ, బూస రమేష్, సర్దార్ అమరదీప్ కౌర్, సాయిల్ల కొమురవ్వ, చెల్లోజు శివమని, ఉప్పరిపల్లి కనకవ్వ, సర్దార్ గుర్మిత్ సింగ్, తాడూరి అంజలి, సానియా సారహ్, చీగిరి దుర్గమ్మ, కొత్త తిరుపతి, కలకుంట్ల రవీందర్ రావు, కల్లేపల్లి శ్రీకర్, బోడనపు రమాదేవి, లింగంపల్లి శంకరయ్య, ఎర్రోజు శ్రీనివాస్, మీర్జా వాజిద్ బేగ్, మీస కొమురయ్య, ఎడ్ల మల్లమ్మ తదితరులు ఉన్నారు.



## సాలూర క్యాంపులో అభివృద్ధి పనులన పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాస్

**బోధన్, మే 16 ( జనంసాక్షి ) :**
సాలూర మండలంలోని సాలూర క్యాంపు గ్రామంలో అభివృద్ధి పనులను శనివారం సాలూర మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ మేరకు ముందుగా గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించడంతో పాటు కూలీలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన తో పాటు ఇంకా పూర్తిగాని ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. అలాగే గ్రామంలో చేపడుతున్న సెన్సెస్ పనితీరును పరిశీలించి ప్రజలు సెన్సెస్ అధికారులకు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రవి, ఎన్యూమరేటర్ అరుణ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ కరీం తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో గ్యాంగ్ అరెస్ట్

## బెదిరించి వసూళ్ల కేసు వెలుగులోకి



**కరీంనగర్ రూరల్, మే 16 ( జనం సాక్షి )**
కరీంనగర్ రూరల్ పోలీసులు బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఓ గ్యాంగ్‌ను అరెస్ట్ చేశారు. జల్సాల కోసం సామాన్యులను లక్ష్యంగా చేసుకుని దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.వావిలాలపల్లి రామాలయం సమీపంలో నివసించే పుతుపరంబిల్ రోహన్ (19) ఈ నెల 13న తీగలగుట్టపల్లి శివారులో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. అక్కడ కిరాణా షాప్ వద్ద ఉన్న అతన్ని దావ దర్శన్ (27), కాసారపు రోహిత్ కుమార్ అలియాస్ రిషి (22)లు కొద్ది దూరం తీసుకెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించి దాడి చేశారు. డబ్బులు లేవని చెప్పినప్పటికీ హింసించి, చంపుతామని బెదిరించారు.తర్వాత వారి స్నేహితుడు కొనగాని మధు (25) కూడా అక్కడికి చేరి బావిలోకి తోసి చంపుతామని హెచ్చరించాడు. భయభ్రాంతులకు గురైన బాధితుడు తన ఐఫోన్‌ను వారికి అప్పగించాడు.తరువాత నిందితులు బాధితుడిని వదిలేసి, ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మరుసటి రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసులు దర్యాప్తు చేపట్టి శనివారం కరీంనగర్ బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని సమీర్ దాబా వద్ద నిందితులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి స్విఫ్ట్ డిజైర్ కారు, బాధితుడి ఐఫోన్, మరో మూడు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ ఏ. నిరంజన్ రెడ్డి వెల్లడించారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటూ పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

## డెంగ్యూ వ్యాధిపై అవగాహన సదస్సు

**కథలాపూర్ మే 16(జనం సాక్షి )**
కథలాపూర్ మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పి.సింధుజ ఆధ్వర్యంలో శనివారం రోజున కథలాపూర్ లో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం జరిపి ర్యాలీ చేపట్టారు. అట్లాగే చింతకుంట గ్రామం నందు గ్రామ సర్పంచ్ నాగం భూమయ్య అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఊట్పల్లి గ్రామ సర్పంచ్ బాల లక్ష్మి అధ్యక్షతన డెంగ్యూ నివారణ కార్యక్రమం అవగాహన సదస్సు నిర్వ హించారు. నివారణకు సంబంధించి నివారణ ఉపాయాలుగా డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తి గత పరిశుభ్రత పాటించడం, దోమలకు సంబంధిత నెట్టులు వాడడం, కాయిల్స్ వాడడం ప్రతి శుక్రవారం మంగళవారం డ్రై డే దినోత్సవం గా పాటించాలన్నారు.కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి సింధుజ, సిహెచ్ఓ టీ వేణుగోపాల్, పి హెచ్ ఎన్ ఓ స్వరూప నర్సింగ్ ఆఫీసర్ శ్రీధర్, ఎల్టి చిన్న రాజన్న, ఫార్మసీ ఆఫీసర్ శ్రీలత ఏఎన్ఎంలు గంగా నర్సు మరియు శిరీష ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ సేవలు గణనీయం

**రామగిరి జనం సాక్షి :** రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న మారేపల్లి ప్రశాంత్ సేవలు గణనీయమని పలువురు ఖాతాదారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం పలువురు ఖాతాదారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా శాలువాతో సన్మానించి జా&జపిక ను అందచేశారు. బ్యాంకులో ఖాతాదారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, మెరుగైన సేవలు అందించిన ప్రశాంత్‌ను అభినందించారు. సేవా దృక్పథంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. మారేపల్లి ప్రశాంత్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, సత్యనారాయణ గౌడ్, గుండం రవి, తీగల శ్రీధర్, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, రాజు, కే. రాజారామ్, శ్రీహరి, క్యాషియర్ ఎం. ప్రత్యూష, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ డెంగ్యూ దినోత్సవ అవగాహన ర్యాలీ



**నిజామాబాద్ అర్బన్ మే 16 జనంసాక్షి**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ లోని కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్ నగర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ డెంగ్యూ దినోత్సవ అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ జండా ఉపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రాంతంలో వీధుల గుండా ర్యాలీలో దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రై డే, చిన్న ప్రాణులు పెద్ద ప్రమాదం, మనందరి పంతం డెంగ్యూ అంతం, దోమలు పుట్టొద్దు దోమలు కుట్టొద్దు, నీటి నిల్వలను తొలగించండి, దోమతెరలను వాడండి, మన ఆరోగ్యం మన చేతుల్లో , ఆరోగ్యమే మహాభాగ్యం లాంటి అవగాహన కలిగించే నినాదాలు చేస్తూ తిరిగి పట్టణ ఆరోగ్య కేంద్రం వద్దకు చేరుకొనీ అక్కడ అవగాహన కలిగించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా డెంగ్యూ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 16వ తారీకు రోజున నిర్వహించుకుంటామని, ప్రజలందరూ దోమల నివారణలో భాగస్వాములు కావాలన్నారు, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం ఇచ్చిన నినాదం'"unite.Act. elimination" అంటే "ఐక్యత, ఆచరించు, నిర్మూలించు"అనే నినాదంతో సంవత్సరం పొడుగునా డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టాలన్నారు.ప్రతి ఒక్కరూ ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమలు పుట్టకుండా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వీధుల్లో ఉండే మున్సిపల్ మరియు గ్రామపంచాయతీ త్రాగునీటి నల్లాలకి ఆన్ ఆఫ్ టూటీలను నిర్మించుకోవాలని ఇంటి చుట్టుపక్కల ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడ కూడా నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ కిటికీలకు, డోర్లకు దోమతెరలను వాడాలని, జిల్లాలో డెంగ్యూ వ్యాధి కేసులు నమోదు కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు, గృహ సందర్శనలో జ్వర సర్వేను నిర్వహించి రక్తపూ తలను పకడ్బందీగా సేకరించాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఒకవేళ నమోదవుతే ఆ ఇంట్లో ఇంటి చుట్టుపక్కన నివసించే 100 ఇండ్ల వరకు యాంటీ లార్వెల్ స్ప్రే, కాంటాక్ట్ రక్త పూతల సేకరణ జరపాలని, ఫ్రైడే డ్రైడే నీ పకడ్బందీగా నిర్వహించాలని, మంగళవారం కూడా డ్రై డే పాటించాలన్నారు. పంచాయతీరాజ్, మునిసిపల్ ,మిగతా శాఖల సమన్వయనీతో కార్యక్రమాలు చేపట్టాలని ఇంటి చుట్టూ పాత టైర్లు, పగిలిన కునీడలు, కుండీలు, ఫ్లవర్ వాసులు,ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు,కొబ్బరి బొండాలు ,కొబ్బరి చిప్ప ల్లో మొదలగు వాటిల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారీ డాక్టర్ అశోక్ ,నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ సుప్రియ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, ఏ ఎం ఓ సలీం, డిహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, పీఎంఓ రూప,సి హెచ్ ఓ సరళ కుమారి, సబ్ యూనిట్ అధికారులు, హెచ్ ఈ ఓ లు వెంకట్ రవి,గోవర్ధన్, నాగరాజు ,లింభారెడ్డి, శ్రీనివాస్, రవి చందర్, రాజేశ్వర్, పర్యవేక్షణ అధికారులు సుజాత, పుష్ప,కిషన్, ఆరోగ్య కార్యకర్తలు అశోక్ మధుసూదన్ , పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా అడిచెర్ల రాజు

**కరీంనగర్ బ్యూరో, మే 16 (జనంసాక్షి) :**



భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అడిచెర్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ నియామకపు ఉత్తర్వుల ప్రకటన విడుదల చేసింది. ఓబిసి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అడిచెర్ల రాజు మాట్లాడుతూ... తన పై నమ్మకంతో ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కార్యదర్శి ఆఫీస్ బేరర్ గా అవకాశం కల్పించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి లతోపాటు నా నియామకానికి సహకరించిన కరీంనగర్ జిల్లా రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకులకు మిత్రులు శ్రేయోభిలాషులు కార్యకర్తలకు అందరికీ అడిచెర్ల రాజు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీ కోసం , ఓబీసీ మోర్చా బలోపేతం కోసం తన వంతు శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**ముస్తాబాద్ మే 16 జనంసాక్షి**
ముస్తాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల తనిఖీ కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఆన్ లోడ్ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను వాహనాల ద్వారా మిల్లులకు, గోదాంలకు తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శనివారం ముస్తాబాద్ మండలం అవునూర్, గూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, బందనకల్ లోని రత్నవి రైస్ మిల్, నామాపూర్ లోని శ్రీ ధనలక్ష్మి రైస్ మిల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు, గోదాంలకు తరలించిన ధాన్యం హమాలీల సంఖ్యను పెంచుకుని అన్ లోడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. వాహనాలు వేగంగా అన్ లోడ్ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరం మేరకు వాహనాలు సమకూర్చాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు.తనిఖీలో తహసీల్దార్ ఫారూఖ్, రెవెన్యూ అధికారులు, ఆర్ ఐ రఘు, తదితరులు ఉన్నారు.

## పేకాట స్థావరంపై చీత ఫోర్స్ మెరుపు దాడి

### ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**నిజామాబాద్ క్రైం మే 16: జనంసాక్షి** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్న నేపథ్యంలో సి.సి.ఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీత ఫోర్స్ సిబ్బంది శనివారం 6 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ ప్రాంతంలో, జిల్లా జైలు పక్కన నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు.పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో చీత ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టగా , కొందరు వ్యక్తులు బహిరంగంగా పేకాట ఆడుతూ కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా , మొత్తం 5 మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నారు.దాడి సందర్భంగా వారి వద్ద నుండి 3 సెల్ ఫోన్లు మరియు రూ.12,530/- నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన వ్యక్తులను మరియు స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం 6 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కి అప్పగించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో పేకాట, గుట్కా, గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట , గంజాయి , డ్రగ్స్ లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీస్ శాఖ సూచించింది.

## భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి

### విద్యార్థి సాత్విక్ ను అభినందించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్ అర్బన్ మే 16 జనంసాక్షి :ఇందూరు:**



ఒలంపియాడ్ సైన్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాత్విక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విద్యార్థిని అభినం దించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి పాఠశాల విద్యతో పాటు ఇతర సబ్జెక్టుల విజ్ఞానాన్ని నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే క్రీడల్లోనూ తర్ఫీదు పొందాలని సూచించారు. వేసవి సెలవులను వృధా చేయకుండా ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో శిక్షణ పొందాలన్నారు. పేద విద్యార్థులకు తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. తమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థి సాత్విక్ ఉత్తమ ప్రతిభను కనబరచడం సంతోషంగా ఉందన్నారు.

### తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో

## " ప్రతిభకు పట్టాభిషేకం"

### ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి లో 1వ, 2వ, 3వ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం..

### తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, మే 16 (జనంసాక్షి) :**
తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్, కరీంనగర్ ప్రేరణ రీజియన్ 9 ఆధ్వర్యంలో శనివారం రోజు ఇందిరా గార్డెన్ లో మీడియా సమావేశం నిర్వహించినారు. ఈ సంద ర్భంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ప్రెసిడెంట్ ఇజ్జగిరి శ్రీనివాస్, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన 9 వారితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి (2025-26)లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మండలాలోని మొదటి, రెండవ, మూడవ స్తానాలలోని విద్యార్థులకు "ప్రతిభకు పట్టాభిషేకం" పేరుతో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల మే 19, మంగళవారం ఉదయం 9 గంటలకు కరీంనగర్‌లోని ఇందిరా గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గంపా నాగేశ్వరరావు, ఇంపాక్ట్ ఫౌండర్ సురేష్ ఆత్మారామ్ మహరాజ్, డాక్టర్ వెంకటేశ్వరరావు ఐసీఐ నేషనల్ ప్రెసిడెంట్, హాజరవుతారని తెలిపారు. అలాగే తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులు, ఇంపాక్ట్ క్లబ్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో మెరుగు నరేష్ ప్రెసిడెంట్, ఐసీఐ కరీంనగర్ ప్రేరణ, రాపెల్లి లింగమూర్తి జనరల్ సెక్రటరీ, ఉప్పుగండ్ల శ్రీనివాస్ రెడ్డి, ఆవుల సుధాకర్, మల్లుగారి రాజిరెడ్డి ఇందిరా గార్డెన్స్ ఫంక్షన్ హాల్ ఇంఛార్జి పాల్గొన్నారు.



# స్మశాన వాటికలలో సౌకర్యాలు కల్పించండి

**ఎల్లారెడ్డిపేట, మే 16, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషాన్‌దాస్‌పేటలో సుమారు 600లకు పైగా కుటుంబాలకు అవసరమయ్యేలా నిర్మించిన స్మశాన వాటికతో పాటు పద్మశాలి సంఘ స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్, పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం రమేష్ సిరిసిల్లలోని ఎన్పీడిసిఎల్ కార్యాలయంలో ఎస్‌ఈ వేణామాదవ్‌కి వినతి పత్రం అందజేశారు. రాత్రిపూట ఎవరైనా మృతిచెందిన సెల్ ఫోన్ వెలుతురుల మధ్య అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కాబట్టి వెంటనే ఎన్పీడిసిఎల్ తరుపున రెండు స్మశానవాటికలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎస్‌ఈ వేణుమాదవ్‌ని కోరారు. గతంలో రెండు స్మశాన వాటికలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అప్పటి సెస్ పాలకవర్గానికి, సెస్ ఏండికి పిర్యాదు చేసిన స్పందించలేదని ఎస్‌ఈ వేణుమాదవ్‌కు వివరించారు. ఎస్‌ఈ వేణుమాదవ్ స్పందిస్తూ అతి త్వరలోనే రెండు స్మశాన వాటికలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఒగ్గు బాలరాజుయాదవ్, వనం రమేష్, ఎన్పిడిసిఎల్ అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## అక్రమంగా ఇసుక రమాణా చేస్తున్న ట్రాక్టర్ పల్టీ
### ఇసుక ట్రాలీ డ్రైవర్‌పై బోల్తాపడి కాలు విరిగి తీవ్రగాయాలు

**ఎల్లారెడ్డిపేట, మే 16, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామంలోని చిట్టివాగు నుండి శుక్రవారం అర్ధరాత్రి ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ టిజి23టి1573,1574 నెంబర్ సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారి పెద్దమ్మ గుడి పైపు వెలుతున్న క్రమంలో బొల్తా పడి డ్రైవర్ కాలు విరిగింది. ఈ ఘటనలో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ అభిలాష్‌పై ఇసుకతో సహ ట్రాలీ బోల్తా పడింది. ఇసుకలో ఇరుక్కపోయి ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న డ్రైవర్‌ను వెంటనే అక్కడున్నవారు ఇసుక నుండి బయటకు తీసి 108 వాహనంలో అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మండల కేంద్రంలో అశ్విని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై తహశీల్దార్ సుజాతకు, ఎస్సీ రాహుల్‌రెడ్డికి గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర చిట్టివాగు, మానేరు వాగు నుండి పదిర, రాగట్లపల్లి, నారాయణపూర్, సింగారం, బండలింగంపల్లి మానేరు వాగుల నుండి నిత్యం రాత్రివేళలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారుజ. విచ్చలవిడిగా యదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నందున జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మైనింగ్ అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



### టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ
# మాతృమూర్తి కన్నుమూత

- రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన ఉపాధ్యాయ లోకం, టీపీటీఫ్ ప్రతినిధులు
- తీవ్ర దిగ్భాంతి వ్యక్తం చేసిన జిల్లా అధ్యక్షులు ఆవుల రాజేష్ యాదవ్

**పెద్దపల్లి, మే 16(జనంసాక్షి) :**
తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ మాతృమూర్తి గురువారం ఉదయం 9 గంటల సమయంలో అనారోగ్యం తో కన్నుమూశారు. ఆమె మరణ వార్త వినగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఉపాధ్యాయుల్లో



ఒక్కసారిగా విషాదం నెలకొంది. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలోని వారి స్వగృహానికి పార్థివ దేహాన్ని తరలించగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఫోరం నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలోతరలివచ్చారు. మాతృమూర్తి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భయ్యా శివరాజ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆవుల రాజేష్ యాదవ్ మాట్లాడుతూ షబ్బీర్ అలీ మాతృమూర్తి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక బలమైన ఉద్యమకారుడిని సమాజానికి అందించిన తల్లినికోల్పోవడం చాలా బాధాకరం అని. ఈ కఠిన సమయంలో షేక్ షబ్బీర్ అలీ, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. మరణవార్త తెలిసిన వెంటనే వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ముఖ్య నాయకులు ఆకారం గ్రామానికి చేరుకుని షబ్బీర్ అలీని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరియుపవిత్రమైన మీ ఆత్మకు శాంతి చేకూరాలని పెద్దపల్లి జిల్లా పక్షాన ప్రగాఢ సానుభూతిని జిల్లా నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. పిఐడిఎ రాష్ట్ర అధ్యక్షుడు కేతరాజు శంకర్, టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భయ్యా శివరాజ్, కోశాధికారి నవీన్,సాంస్కృతిక శాఖ రాష్ట్ర కార్యదర్శి తిరుమలేశ్,ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునిల్ కుమార్,నల్గొండ జిల్లా అధ్యక్షులు మధుమూర్తి, సంజీవరెడ్డి, చిట్యాల మండల అధ్యక్షులు నర్రా భిక్షం రెడ్డి,కూనురుమధు,సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ, జనగామ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ యాకుబ్ పాష, వర్కింగ్ ప్రెసిడెంట్స్ సాయి,సునీల్,తదితరులు ఉన్నారు.

## నిరుపేద దహన సంస్కారాల ఖర్చులకు ఆదుకున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్

**సుల్తానాబాద్,మే 16(జనంసాక్షి):**
మండలం లోని చిన్నబొంకుర్ గ్రామం లో కుండీ అమృతమ్మ అనే నిరుపేద మహిళ నిన్న రాత్రి అనారోగ్యం తో మృతి చెందగా, వారి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని స్థానిక, బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్ దహన



సంస్కారాల ఖర్చులకు, 3000,వారి కుమారుడు కుండీ సంపత్ కి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి,అబ్బోజు చారి, ప్రేమ్ కుమార్, లక్ష్మణ్, కుండి రమేష్ స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ప్రపంచ ఏడవ తెలుగు సాహిత్య మహాసభలకు యువ కవి శ్రీనివాస్ నియామకం

**ఎల్లారెడ్డిపేట, మే 16, (జనంసాక్షి) :**
ప్రపంచ 7వ తెలుగు సాహిత్య మహాసభలకు జాతీయ సమన్వయకర్తగా కట్ల శ్రీనివాస్‌ను నియామకం చేసినట్లు సంస్థ జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం ఆహ్వానం పంపినట్లు శ్రీనివాస్ తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహిత్యం సాంస్కృతిక సామాజిక సేవ సంస్థ ఆధ్వర్యంలో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమహేంద్రవరంలో జూన్6, 7వ తేదిలలో రెండు రోజుల పాటు జరిగే 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బాకుర్‌పల్లి చెందిన కట్ల శ్రీనివాస్‌ను మహా సభల సమన్వయకర్తగా నియామకం చేసినట్లు శుక్రవారం ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా సభలో తనకు గౌరవం ఉందని సంస్థ అవార్డుతో తనను సత్కరిస్తారని సంస్థ వారు సమాచారం అందించారని శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం కట్ల శ్రీనివాస్ హైదరాబాద్‌లోని కొంపల్లిలోని శ్రీచైతన్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను శ్రీ చైతన్య పాఠశాల ఏజీయం, ప్రిన్సిపాల్, డీన్ ఇంచార్జీలు, తోటి ఉపాధ్యాయులు, బాకుర్‌పల్లి గ్రామస్తులు, యువకులు రాజకీయ నాయకులు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

### ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలు నిషేధించాలని ఈ నెల 20న మెడికల్ షాపుల బంద్



**ఎల్లారెడ్డిపేట, మే 16, (జనంసాక్షి) :**
ఆన్‌లైన్‌లో మందులు అమ్మకాలు నిషేదించాలని ఈ నెల20న మెడికల్ షాపులు బంద్ చేయాలని మెడికల్ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల యూనియన్ సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదిన బుధవారం ఆల్ ఇండియా కెమిస్ట్ అసోసియేషన్ (ఏఐసిడి) ఒక్కరోజు స్ట్రైక్ పిలుపుమేరకు ఎల్లారెడ్డిపేట మండలంలోని క్రిమిస్టా అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో మెడిసిన్ అమ్మకాలు నిషేదించాలని, కార్పోరేట్ షాపుల్లో అధిక మొతాదులో డిస్కౌంట్లు ఆపాలని, స్పూరియస్ మెడిసిన్ అవైడ్ చేయాలనే అనే డిమాండ్లతో మెడికల్ షాపులు 20న తేదిన బందు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి బందుకు ప్రజలు సహరించాలని మండల అసోసియేషన్ తరుపున తెలియజేశారు. ఏదైన అత్యవసర పరిస్థితిలో మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్‌లో గల కావేరి మెడికల్ అందుబాటులో ఉంటుందన్నారు. మరి ఏదైన సమాచారం నిమిత్తం అధ్యక్షులు బొమ్మకంటి రాజయ్య, ప్రధాన కార్యదర్శి పొన్నాల బాల్‌రెడ్డి, కోశాధికారి రామభీమేశ్వర్‌ను సంప్రదించాలని అధ్యక్షులు తెలిపారు.

# ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

- ❍ పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్. మల్లికార్జున స్వామి
- ❍ సాంకేతిక కారణాలతో మే 14 నుంచి ప్రారంభం కావాల్సిన దరఖాస్తుల ప్రక్రియ మే 25కు వాయిదా
- ❍ మే 25 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**పెద్దపల్లి,మే 16(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఏటీసీలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్. మల్లికార్జున స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్, టీసీ తదితర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 14-05-2026 నుంచి ప్రారంభం కావాల్సిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ సాంకేతిక కారణాల వల్ల 25-05-2026కు వాయిదా పడినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 25-05-2026 నుంచి 08-06-2026 వరకు ఉపిఐటిఐ. తెలంగాణ గౌ.ఇన్ది(ఎచ్ టి టి పి ఎస్:// యుటిఎం సోర్స్ =చాట్ జిపిటి కం) వెబ్‌సైట్‌లో రూ. 100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 01-08-2026 నాటికి 14 సంవత్సరాలు పూర్తి అయిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ సొంత సెల్‌ఫోన్ నంబర్ మరియు ఈ-మెయిల్ ఐడీలను మాత్రమే ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీలను ఐటీఐ కోర్సు పూర్తయ్యే వరకు మార్చకూడదని సూచించారు. మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్‌లలో ఎక్కువ సంఖ్యలో ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో కోరారు.